సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 25 । మార్చి । 2023



పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతులు

ఇల్లంతకుంట(మానకొండూర్): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు అన్నారు. ఇల్లంతకుంట రైతువేదికలో శుక్రవారం పోషణపక్షం చేశారు.



వందశాతం ఫలితాలు సాధించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదోతరగతి విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఉపవాసంతో మనిషిని బాధించడం ఇస్లాం ఉద్దేశం కాదు. పేదవాడి ఆకలి బాధలు తెలుసుకోవడమే ఇస్లాం ఉద్దేశం.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:32	ఆది 4:51

న్యూస్‌రీల్

శ్రీరామనవమికి జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



అరుణకు పత్రిక అందిస్తున్న ఉద్యోగులు

కోనరావుపేట(వేములవాడ): మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను జూనియర్ అసిస్టెంట్ కోల కమలాకర్ ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం ఆహ్వానపత్రిక అందించారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 6 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30న సీతారాముల కల్యాణం, ఏప్రిల్ 6న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొక్కుల నర్సయ్య, ఎల్లారెడ్డి, అనిల్ ఉన్నారు.

అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న అన్నపూర్ణ

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు శుక్రవారం నామినేషన్ల ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారి గుడిసె సదానందం తెలిపారు. ఈనెల 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అడ్వకేట్లు తమ ఓటుహక్కును ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకోవాలని కోరారు. అధ్యక్షుడికి 4, ఉపాధ్యక్షుడికి 3, జనరల్ సెక్రటరీ 2, జాయింట్ సెక్రటరీకి 2, లైబ్రరీ సెక్రటరీకి 3, స్పోర్ట్స్ సెక్రటరీకి 2, ట్రెజరర్‌కు 2, లేడీ రిప్రజెంటేటివ్ అన్నపూర్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. సీనియర్ ఈసీ మెంబర్ నలుగురు, జూనియర్ ఈసీ మెంబర్లు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

పాడిపరిశ్రమతో ఆర్థికాభివృద్ధి



బోయినపల్లిలో లబ్ధిదారుల సమావేశం

బోయినపల్లి(చొప్పదండి): పాడిపరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండలానికి చెందిన 56 మంది లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపరిశ్రమతో ఉపాధి పొందేందుకు ప్రభుత్వం రుణాలు అందిస్తుందన్నారు. అనంతరం పాడిగేదెల యూనిట్లకు ఎంపికైన లబ్ధిదారుల నుంచి ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించారు. ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి రమేశ్, ఎస్‌ఏ ఆరిఫ్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు పూర్తి చేయండి



ఇళ్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వీర్నపల్లి(సిరిసిల్ల): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. మండలంలోని కంచర్ల, వీర్నపల్లి, ఎర్రగడ్డ గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను శుక్రవారం పరిశీలించారు. ఇసుక కొరత లేకుండా చూడాలని స్థానిక అధికారులను ఖీమ్యానాయక్ ఆదేశించారు. తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, డీటీ ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూల, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

శెనగలు కొనేదెప్పుడో?

- జిల్లాలో ఒకే ఒక కేంద్రం
- జిల్లాలో 300 ఎకరాల్లో సాగు
- సరైన దిగుబడి లేక రైతుల ఆవేదన
- తేమ రాక తిప్పలు

జిల్లా సమాచారం

సాగు విస్తీర్ణం	: 300 ఎకరాలు
కొనుగోలు కేంద్రాలు	: 01
మద్దతు ధర	: రూ.5,335
దిగుబడి అంచనా	: 250 మెట్రిక్‌టన్నులు



బోయినపల్లిలోని కొనుగోలు కేంద్రంలో శెనగలను ఆరబెడుతున్న రైతులు

బోయినపల్లి(చొప్పదండి): శెనగ రైతుల కష్టాలు తీరడం లేదు. శెనగ పంట చేతికొచ్చిన అకాల వర్షాలతో తేమశాతం రాక కొనుగోళ్లు మొదలు కాలేదు. దీంతో పంట అమ్ముకునేందుకు రైతులకు ఎదురుచూపులే దిక్కయ్యాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 300 ఎకరాలలో శెనగ పంట సాగుచేశారు. జిల్లాలో శెనగల కొనుగోలుకు ఒకే కేంద్రాన్ని బోయినపల్లిలో ఏర్పాటు చేశారు. పంట చేతికి రావడంతో ఇటీవల రైతులు కేంద్రానికి తీసుకొస్తున్నారు. అయితే వర్షాలు పడుతుండడంతో తేమశాతం రాక పూర్తిస్థాయిలో కొనుగోళ్లు మొదలుకాలేదు. గురువారం ఒక్క రోజు తూకం వేసిన అధికారులు వాటిని తరలించకుండా అక్కడే ఉంచేశారు. మిగతా రైతులవి కేంద్రంలోనే ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఒకే కేంద్రం..

జిల్లా వ్యాప్తంగా బోయినపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శెనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈనెల 14వ తేదీన శెనగల కొనుగోలు కేంద్రాన్ని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. వరుసగా వర్షాలు పడడంతో కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో ప్రతీ రోజు రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చిన శెనగ కుప్పలపై కవర్లు కప్పి వెళ్తున్నారు. మళ్లీ ఉదయం వచ్చి కవర్లు తీసి ఆరబెడుతున్నారు. ఇలా పదిహేను రోజులుగా ఇదే తంతు కొనసాగుతోంది.

300 ఎకరాల్లో సాగు

జిల్లాలోని బోయినపల్లి, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, వేములవాడరూరల్ మండలాల్లో దాదాపు 300 ఎకరాల్లో శెనగ పంట సాగుచేశారు. జిల్లాలో సుమారు 250 మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.5,335 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తోంది. శెనగల కొనుగోలుకు 14 తేమ శాతం ఉండాలని అధికారులు నిబంధన పెట్టారు. శెనగ పంట వేసినప్పుడు సరైన వర్షాలు పడక విత్తనాలు సరిగ్గా మొలవలేదని దీంతో దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన పడుతున్నారు. ఎకరానికి 3 నుంచి 4 క్వింటాళ్ల మేర మాత్రమే దిగుబడి వచ్చిందని వాపోయారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు సురేశ్, సుబ్బారావు తెలిపారు. శెనగలు వర్షంలో తడిస్తే ఫంగస్ వచ్చి నల్లబడుతుందని.. అందుకే నిత్యం కేంద్రం వద్ద కాపలా ఉంటూ తడవకుండా చూస్తున్నామని చెప్పారు. వర్షంతో శెనగల కొనుగోలు ఆలస్యమైందని, ప్రస్తుతం కొనుగోళ్లు చేపడుతున్నట్లు బోయినపల్లి డీసీఎంఎస్ సెంటర్ ఇన్‌చార్జి నర్సింహారావు తెలిపారు.

వర్షంతోనే భయం



శెనగ పంట వేసుడే ఒక ఎత్తయితే.. అమ్ముకోవడం మరో ఎత్తులా ఉంది. రోజూ సాయంత్రం కాగానే మొగులు అవుతుంది. వర్షం పడుతుందని భయం అవుతుంది. సెంటర్‌లో ఆరు క్వింటాళ్ల మేర శెనగలు పోశాను.
– పెగ్గెర్ల యాదగిరి, బోయినపల్లి

దిగుబడి తగ్గింది



ఐదెకరాలను కౌలుకు తీసుకొని శెనగ పంట వేసిన. మొదట్లో వర్షాలు కురువక విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పెడితే 3 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. ఇప్పుడు శెనగపంట చేతికొచ్చి సెంటర్‌లో పోశాక వర్షాలు పడుతున్నాయి.
– సుబ్బారావు, బూర్గుపల్లి

కొనుగోళ్లు చేపడుతున్నాం



జిల్లాలో 300 ఎకరాల్లో శెనగ సాగు చేశారు. 250 మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పుడు బోయినపల్లి ఏఎంసీలో శెనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం. సెంటర్ ప్రారంభించిన తర్వాత వర్షాలు పడడంతో కొనుగోళ్లు చేపట్టలేదు. ఇప్పుడు కొనుగోళ్లు మొదలయ్యాయి. రుద్రంగిలో సైతం సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది.
– దివ్యభారతి, డీఎం, మార్క్‌ఫెడ్, సిరిసిల్ల



వార్షికోత్సవ సంబరం

సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవ సంబరాలు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జీలు బి.శ్రీనివాస్, జి.మహేశ్, పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లాలోని ఆర్సీ ఇన్‌చార్జీలు, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఐటీ మేనేజర్ వేణు, ఏసీఎం మధుకర్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ప్రకాశ్, స్టోర్ ఇన్‌చార్జి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు నివారించాలి

- వైకుంఠధామాల్లో వసతులు కల్పించాలి
- భూసేకరణ పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. వైకుంఠధామాల్లో వసతులు కల్పించి, వినియోగంలోకి తేవాలని, పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని, నిర్మాణంలో ఉన్న వాటిని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కంటివెలుగు పరీక్షలు పూర్తయిన వారికి అద్దాలను పంపిణీ చేయాలని, ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సూచించారు. పదోతరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేసవిలో హరితహారం మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలన్నారు. బోయినపల్లి మండలంలో అదనపు టీఎంసీ కోసం వేగంగా భూసేకరణ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఎఫ్‌వో బాలమణి, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా విద్యాధికారి రమేశ్, ఇంటర్మీడియట్ అధికారి మోహన్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్సారీ, బోయినపల్లి తహసీల్దార్లు నరేశ్, పర్యవేక్షకులు రమేశ్ పాల్గొన్నారు.

నేడు వేములవాడకు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక

వేములవాడ: వేములవాడ రాజన్న దర్శనానికి రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, ప్రిన్సిపాల్ సెక్రెటరీ అలీ మహమ్మద్ సర్ఫరాజ్ శనివారం వస్తున్నారని ఆలయ అధికారులకు శుక్రవారం ప్రకటించారు. ఈమేరకు ఆలయ అధికారులు చీఫ్ జస్టిస్ దర్శనం ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు
- సిరిసిల్లలో క్షయ నివారణ దినోత్సవ ర్యాలీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్లటౌన్: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వైద్యశాఖ పనిచేస్తుందని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో క్షయ నివారణ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ 2025 వరకు జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స సమయంలో ప్రభుత్వం నుంచి నెలకు రూ.500 ఆర్థిక సాయం ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. రెండు వారాలపాటు దగ్గు, జ్వరం ఉంటే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, డీపీవో ఉమ, బాలయ్య, లింగం, జలపతి పాల్గొన్నారు.

కిట్లు వితరణ

సిరిసిల్లలోని 20 మంది క్షయ రోగులకు ఆరు నెలల పాటు సరిపడే పౌష్టికాహారం కిట్లను 39వ వార్డు కౌన్సిలర్ ఆకుల కృష్ణ అందించారు. స్థానిక చందన చెస్ట్ క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో కిట్లను వితరణ చేసిన వైద్యులు డాక్టర్ సతీశ్‌రెడ్డి, చందనరెడ్డిలను అభినందించారు. అనంతరం రోగులకు వైద్యులు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు.

మహిళల భద్రతకు షీ టీమ్



హాజరైన విద్యార్థినులు



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: మహిళలు, యువతులు, విద్యార్థినిలు భద్రతకు షీటీమ్ పనిచేస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. షీటీమ్ అందించే సేవలపై సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం 8, 9వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులను, మహిళలను ఇబ్బందులకు గురిచేయడం, ఈవ్‌టీజింగ్ చేసినప్పుడు ప్రతి ఒక్కరు ప్రశ్నించాలన్నారు. సోషల్‌మీడియాలో కానీ, నేరుగా కాని వేధిస్తే వెంటనే 100, జిల్లా షీటీమ్ నంబర్ 87126 56425లో సమాచారం ఇవ్వాలని కోరారు. మైనర్‌లపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత విద్యతోనే వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. చదువుకునే వయసులో యువతులు ప్రలోభాలు, ఆకర్షణలకు గురై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. డీఎస్పీ విశ్వప్రసాద్, సీఐ అనిల్‌కుమార్, ఎంఈవో రఘుపతి, షీటీమ్ ఎస్సై ప్రేమ్‌దీప్, ఎస్సైలు రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



నెమలివాహనంపై స్వామి వారి విహారం

రాజన్న సన్నిధిలో రామన్నకు పూజలు

వేములవాడ: వేములవాడలోని రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాజన్నకు, రామన్నకు పూజలు చేశారు. శుక్రవారం రాజన్నను 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను నెమలివాహనంపై ఊరేగించారు.

ప్రశ్నించడంతోనే సభ్యత్వం రద్దు



వేములవాడ: కేంద్ర ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై లోక్‌సభలో ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. వేములవాడలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లే అవకాశం కల్పిస్తూనే ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. వెంకటస్వామి, రాకేశ్, శ్రీనివాస్, సంగ స్వామి, మధు, విష్ణు, రాము, తిరుపతి, గణేశ్, కృష్ణ, శంకర్, నరేశ్, శ్రీకాంత్, సురేశ్, ప్రకాశ్, ఎల్లయ్య, రాజేందర్, ప్రభాకర్, పర్శరాం పాల్గొన్నారు.

గ్రూప్‌–1కు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: గ్రూప్‌–1 పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు బీసీ స్టడీసర్కిల్‌లో ఈనెల 29 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో శిక్షణ తీసుకున్న వారు, మెయిన్స్‌కు అర్హత పొందిన వారు దరఖాస్తుకు అనర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5వేలు స్టైఫండ్ అందజేస్తామని తెలిపారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- కథలాపూర్ ఏఎంసీ చైర్మన్‌గా సౌజన్య



మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసిన వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వడగండ్ల వర్షంతో నష్టపోయిన ప్రతి రైతుకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించిన మంత్రి నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు శుక్రవారం హైదరాబాద్‌లో కలుసుకుని ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మేడిపల్లి మండలం పసునూరులో ఆరెకరాలు, కథలాపూర్ మండలం కలికోటలో 20 ఎకరాలు, రుద్రంగి మండలంలో 26 ఎకరాలలోని పంటలకు నష్టపరిహారం చెల్లించినట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. కథలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుండారపు సౌజన్య, వైస్‌చైర్మన్‌గా సోమ దేవేందర్‌రెడ్డిలతోపాటు పాలకవర్గ సభ్యులుగా ఆనుగు ఆదిరెడ్డి, వన్నెల గంగరాజం, రాచమడుగు గంగారావు, కల్లూరి రమేశ్, బాలె రూపిక, లౌద్య నరేశ్, లక్క రమేశ్, సబ్బని గంగు, షేక్ ముగ్దుంబాషా, కొత్తపల్లి శ్రీనివాస్, వేణుగోపాల్, మేడిపల్లి రాజారెడ్డి, దాసరి గంగాధర్‌ను నియమించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య
- 300 మంది రైతులకు అవగాహన

జనగామరూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భాగ్య మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమలతో ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6వేల మందికిపైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు చెప్పారు. రైతులకు బిందు సేద్యం వసతి కల్పిస్తున్నారని తెలిపారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. వినోద్‌యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాథ చిన్నారికి ఆర్థికసాయం



బాండ్ అందిస్తున్న గల్ఫ్ మిత్రులు

కోనరావుపేట(వేములవాడ): తల్లీతండ్రి మృతి చెందడంతో అనాథగా మారిన ఓ చిన్నారికి గల్ఫ్ మిత్రులు ఆర్థిక చేయూతనందించారు. కోనరావుపేటకు చెందిన బండి ప్రశాంత్–నవీన దంపతులకు కూతురు శ్రేష్ట(ఏడాది) ఉంది. అనారోగ్యానికి గురైన ప్రశాంత్ నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. భర్త మృతిని తట్టుకోలేక భార్య నవీన మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. దీంతో కూతురు శ్రేష్ట అనాథగా మారింది. ప్రస్తుతం అమ్మమ్మ వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న గల్ఫ్‌మిత్రులు దుబాయ్, మస్కట్, కువైట్, సౌదీ, బహ్రెయిన్, ఖతార్‌లో ఉంటున్న మిత్రులు రూ.55వేలు విరాళాలుగా జమచేశారు. గ్రామంలో ఉంటున్న బొల్లె ప్రశాంత్, దూర్ల రాజేశం, మాందాల ప్రశాంత్‌కు పంపించారు. శుక్రవారం చిన్నారి పేరిట బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌పేపర్‌ను అందజేశారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఈనెల 3న ఇంటిపైకి వచ్చి దాడి చేసిన ఘటనలో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఆకుబత్తిని వెంకటసాయి, గాంధీనగర్‌కు చెందిన మ్యాన పావని ఈనెల 9న ప్రేమపెళ్లి చేసుకున్నారు. అనంతరం వెంకటసాయి బావ అయిన జిల్లెల్లకు చెందిన శ్రీరామ్ శ్రీకాంత్ ఇంటికొచ్చారు. ప్రేమపెళ్లి నచ్చని పావని తరఫు వారు జిల్లెల్లకు వచ్చి వెంకటసాయిని, అడ్డుగా వచ్చిన వారిపై దాడిచేశారు. దాడికి పాల్పడిన వారిలో శ్యాంప్రసాద్, టాకూర్ రిశ్వంత్‌ను పట్టుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెకు చెందిన గుర్రం చంద్రయ్య (70) గురువారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న ఇనుప పైపుకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. చంద్రయ్య భార్య రెండేళ్ల క్రితం, కొడుకు ఏడాది క్రితం మరణించారు. అప్పటి నుంచి మనస్థాపంతో ఉంటున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న చంద్రయ్య శుక్రవారం ఉదయం చూసేసరికి ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి మనవడు ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తంగళ్లపల్లి పోలీసులు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి గొర్లకాపరికి గాయాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన గొర్ల కాపరి జగ్గని రాజేశం యాదవ్ శుక్రవారం చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. ప్రతి రోజు మాదిరిగానే గొర్లను మేపేందుకు తీసుకెళ్లిన రాజేశం గొర్ల మేత కోసం చెట్టు ఎక్కి కొమ్మలు కొట్టి దిగుతుండగా పట్టుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ రాజేశంను సిరిసిల్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఇళ్లకు సోలార్ వెలుగులు

- సబ్సిడీపై స్వశక్తి సంఘాలకు అందజేత
- స్త్రీనిధి ద్వారా రుణం మంజూరు
- గ్రామీణాభివృద్ధి శాఖ విస్తృతంగా ప్రచారం

చందుర్తి(వేములవాడ): పెరుగుతున్న విద్యుత్ చార్జీలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. అంతేకాకుండా సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. దీనికి సబ్సిడీ సైతం అందజేయనుంది. ప్రతీ మండలానికి 300 యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. నేడు దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఇప్పటికే జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించింది.



సోలార్ విద్యుత్ యూనిట్లపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు (ఫైల్)



బంగ్లాపై ఏర్పాటు చేసే సోలార్ ప్యానెల్ నమూనా

యూనిట్ల వివరాలు ఇలా..

	2 కిలోవాట్లు	3 కిలోవాట్లు
ప్రాజెక్టు విలువ	రూ.1,42,200	రూ.1,92,360
సబ్సిడీ	రూ.39,200	రూ.57,360
దరఖాస్తు రుసుం	రూ.2,360	రూ.3,450
నెట్‌మీటరు చార్జ్	రూ.2,950	రూ.2,950
స్త్రీనిధి రుణం	రూ.1,00,000	రూ.1,25,000
సభ్యురాలి వాటా	రూ.3,000	రూ.10,000
నెలసరి వాయిదా	రూ.2,243	రూ.2,803

స్త్రీ నిధి ద్వారా రుణం

- సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే మహిళకు స్త్రీ నిధి ద్వారా సబ్సిడీ రుణం అందజేయనుంది.
- నెలకు 150 నుంచి 250 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించుకునే మధ్యతగరతి కుటుంబానికి 2 కిలోవాట్ల యూనిట్ సరిపోతుంది. రోజుకు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.
- పెద్ద కుటుంబానికి 3 కిలోవాట్ల సామర్థ్యం గల యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే.. రోజుకు 12 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.
- సోలార్ ప్యానెల్స్ 25 ఏళ్ల వరకు పనిచేస్తాయి. ఐదేళ్ల వరకు గ్యారంటీ కూడా ఉంటుంది.

ఆన్‌గ్రిడ్ సిస్టంలో సోలార్ విద్యుత్

సోలార్ విద్యుత్ వినియోగించుకునే సంఘాల సభ్యులకు మరింత ప్రయోజనాన్ని చేకూర్చేలా ఆన్‌గ్రిడ్ సిస్టంను అమలు చేస్తుంది. గతంలో ఆఫ్‌గ్రిడ్ ద్వారా సోలార్ విద్యుత్ సిస్టంను అందించే వారు. ప్రస్తుతం ఆన్‌గ్రిడ్ పద్ధతిలో ఉంది. ఈ విషయమై ప్రభుత్వం ఇటీవల టీఎస్ రెడ్‌కో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

- సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులకు విద్యుత్ అవసరాని కంటే ఎక్కువగా ఉత్పత్తి ఉంటే విక్రయించుకునే అవకాశం కల్పిస్తారు .
- సోలార్ విద్యుత్‌ను విక్రయించేందుకు ఈ విద్యుత్ యూనిట్లకు నెట్‌మీటర్లు బిగించి పవర్‌గ్రిడ్‌ను అనుసంధానిస్తారు. అవసరాలకు పోగా.. మిగిలిన విద్యుత్‌ను నిర్ణీత ధర ప్రకారం గ్రిడ్‌లు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటారు. తద్వారా వచ్చే ఆదాయాన్ని స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాన్ని చెల్లించుకోవచ్చు.

విద్యుత్ భారం తప్పుతుంది



ప్రభుత్వం సోలార్ విద్యుత్ యూనిట్‌ను సబ్సిడీపై అందజేస్తుందని అధికారులు తెలిపారు. విద్యుత్ చార్జీల భారం తప్పుతుందని దరఖాస్తు చేసుకున్న. 2 కిలోవాట్ల యూనిట్‌కు రూ.39,200 సబ్సిడీ వస్తుందని చెప్పారు.
– పిట్టల శ్రీలత, లింగంపేట, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు

ప్రయోజనాలు వివరిస్తున్నాం



గ్రామాల్లోని స్వయం సహాయక సంఘం సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. యూనిట్ సామర్థ్యం ఆధారంగా ఎంత ఖర్చు అవుతుందన్న పూర్తి సమాచారాన్ని ఆయా గ్రామాల వీవో సంఘాల సభ్యులకు లెక్కలు వేసి అప్పగిస్తున్నాం.
– రజిత, ఐకేపీ ఎంపీఎం, చందుర్తి

దరఖాస్తు చేసుకోవచ్చు



సోలార్ విద్యుత్ సబ్సిడీ యూనిట్ కోసం ఆసక్తి ఉన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా మండలానికి 300 చొప్పున యూనిట్లను ఇచ్చిన ప్రభుత్వం తిరిగి ఆసక్తి ఉన్న సభ్యురాలకు ఇవ్వాలని ఆదేశించింది. అవగాహన కల్పిస్తున్నాం. – గౌతంరెడ్డి, డీఆర్‌డీఏ జిల్లా అధికారి

ఆటో బోల్తా

- విద్యార్థులకు గాయాలు
- త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆసుపత్రిలో పిల్లలకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నాగాయపల్లి వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో ఐదుగురు విద్యార్థులలతోపాటు హెచ్‌ఎం, ఆటోడ్రైవర్ గాయపడ్డారు. హెచ్‌ఎం తెలిపిన వివరాలు. మర్రిపల్లి కేజీబీవీ ఇంటర్ విద్యార్థులు వేములవాడలో పరీక్షలు రాసి తిరిగి వస్తుండగా నాగాయపల్లి వద్ద ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థినులు గౌతమి, ప్రణ్య, రుచిత, జ్యోతి, రిజ్వాన్, లెక్చరర్ రజనీ, డ్రైవర్ లక్ష్మీనారాయణ గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల స్పెషల్ ఆఫీసర్ శకుంతల ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆసుపత్రికి వచ్చి పిల్లలను చూసి రోదించారు.

సమగ్ర శిక్ష సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో భాగంగా గత పదిహేనేళ్లుగా విద్యాశాఖలో పనిచేస్తున్న కేజీబీవీ, సీఆర్పీ, మిస్‌సీవో, యూఆర్‌ఎస్ స్టాఫ్, డీపీవో స్టాఫ్‌ను రెగ్యులరైజ్ చేయాలని బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ కోరారు. సిరిసిల్లలో శుక్రవారం ఆఫీస్ బేరర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా, హర్యానా రాష్ట్రాలలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేశారని దీని ప్రకారం మన రాష్ట్రంలో ఎస్‌ఎస్‌ఏ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వికృతి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పులి రామ్‌గోపాల్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల సుధాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తాడికొండ కృష్ణహరి, రాష్ట్ర కౌన్సిలర్ కాలేరు రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

- ఒకటో తేదీన జీతాలు అందించాలి
- ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిరిసిల్లటౌన్: ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని యూఎస్‌పీసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిరిసిల్ల నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతీ నెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులు ఐదారు రోజుల్లో చెల్లించే వారని ఇప్పుడు ఏడాది గడుస్తున్నా ఇవ్వకపోవడంపై ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు సకాలంలో వేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. యూఎస్‌పీసీ నాయకులు పాకాల శంకర్ గౌడ్, దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, విజయ్‌కుమార్, మహేందర్, రమానాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజలింగంతోపాటు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫసల్‌బీమా అమలు చేయాలి

- సింగిల్‌విండో ఎదుట బీజేపీ ధర్నా



సింగిల్‌విండో ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఫసల్‌బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ మండలంలోని పోతుగల్ సింగిల్‌విండో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. బీజేపీ మండలాధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు రైతులను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు బీమా పరిహారం దక్కడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్, కోల కృష్ణ, క్రాంతి, అంజాగౌడ్, సంజీవ్, రాంగోపాల్, మల్లారెడ్డి, గోపి, నరేశ్, చిగురు వెంకన్న, కల్యాణ్, ఉపేంద్ర, శేఖర్, రాజ్‌కిరణ్, వెంకటేశ్, సాయి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్‌నేరగాళ్లకు చిక్కిన యువతులు

- ఒకరు రూ.10 వేలు..
- మరొకరు రూ.2వేలు మోసపోయిన వైనం

కోనరావుపేట(వేములవాడ): సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. బంధువుల పేరుతో చాటింగ్ చేసి డబ్బుల లాగుతున్నారు. డబ్బులు వారికి చేరడంతోనే ఆ నంబర్ నుంచి మెస్సేజ్ రావడం ఆగిపోతుంది. మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. కోనరావుపేట మండలానికి చెందిన ఓ యువతికి ఆమె బంధువు పేరిట మెస్సేజ్ వచ్చింది. తన ఖాతా పరిమితి దాటిపోయిందని అర్జంటుగా రూ.10 వేలు పంపమని మెస్సేజ్ పెట్టాడు. దగ్గరి బంధువే కదాని డబ్బులు పంపింది. డబ్బులు పంపిన వెంటనే లైన్ కట్ అయింది. బంధువుకు ఫోన్ చేయగా తాను కాదని చెప్పడంతో మోసపోయినట్లు తెలుసుకున్నారు. మరో మహిళకు కూడా ఇలాగే మెస్సేజ్ రావడంతో ఆమె రూ.2 వేలు పంపింది. వీరు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి మెస్సేజీలు వస్తే ఎవరూ స్పందించవద్దని పోలీసులు కోరుతున్నారు.

రాహుల్‌కు కోర్టు శిక్ష విధించడం అన్యాయం

- గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ధర్నా



ఎల్లారెడ్డిపేటలో ధర్నా చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎన్నికల సభలో ప్రధాని మోదీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మాట్లాడినందుకు రాహుల్‌గాంధీకి కోర్టు శిక్ష విధించడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని గాంధీ విగ్రహం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీ పాదయాత్రకు పెరుగుతున్న అభిమానాన్ని చూడలేకే బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. పందిర్ల లింగంగౌడ్, సద్ది లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, రాంరెడ్డి, దేవయ్య, బాలయ్య, ఇమామ్, కిషన్, రమేశ్, సంతోష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, బాబు, రవి, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట(మానకొండూర్): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఇల్లంతకుంటలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులకు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీరాజ్ మండలస్థాయి అవార్డులను శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి వేలాది కోట్లు మంజూరు చేస్తున్నారన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు రూ.200 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో మీర్జా ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు తరిమికొట్టాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- నాగారంలో హాథ్‌సే హాథ్ జోడో యాత్ర



నాగారంలో ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తరిమికొట్టాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని నాగారంలో శుక్రవారం ఇంటింటికీ హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో రైతుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రైతు వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో 8 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. విద్యుత్, బస్సు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందన్నారు. ధనిక రాష్ట్రమని చెబుతున్న నాయకులు సంక్షేమ పథకాలకు నిధులు లేక, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయక, నిరుద్యోగ భృతి ఇవ్వక యువతను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గ్యాస్ సిలిండర్ ధర 2014లో రూ.450 ఉండగా ప్రస్తుతం రూ.1,250 చేరిందన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, భాస్కర్‌రావు, భూషణం, తాళ్లపెల్లి ప్రభాకర్, కచ్చకాయల ఎల్లయ్య పాల్గొన్నారు.

వసతిగృహ ఆధునికీకరణ పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో చేపట్టిన ఆధునికీకరణ పనులు అంబేద్కర్ జయంతిలోపు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ బాలుర వసతిగృహాన్ని, మోడల్‌స్కూల్, కేజీబీవీలను శుక్రవారం సందర్శించారు. వసతిగృహంలో రూ.25లక్షలతో చేపట్టిన టాయిలెట్స్, వంటగది, డైనింగ్‌హాల్, లైబ్రరీ, పెయింటింగ్, కొత్త తలుపుల ఏర్పాటు, దోమల బెడద నివారణకు జాలీల ఏర్పాటు పనులు, లీకేజీలను అరికట్టే పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీలోని వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. మినరల్ వాటర్‌ప్లాంట్, టాయిలెట్ బ్లాక్‌లను పరిశీలించారు. త్వరలోనే ఐఐటీ, జేఈఈ మెటీరియల్‌ను లైబ్రరీలో అందుబాటులో ఉంచుతామన్నారు. డీఈవో రమేశ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ రమేశ్, వసంత, వసతిగృహం సంక్షేమాధికారి రాంచంద్రారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణకు కృషి

- టీటీడీ ఈఈ నరసింహమూర్తి
- శ్రీవేణుగోపాలస్వామి ఆలయం పరిశీలన



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఈఈ, ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో పురాతన ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం ముందుకొచ్చిందని, ఈ ప్రాంత ప్రజల సహకారంతో శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునరుద్ధరిస్తామని టీటీడీ ఈఈ నరసింహమూర్తి పేర్కొన్నారు. జిల్లాలోని సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, ఎల్లారెడ్డిపేటలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలను శుక్రవారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఇప్పటికే వేణుగోపాలస్వామి ఆలయానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈనేపథ్యంలోనే ఆలయ అభివృద్ధికి టీటీడీ ముందుకురావడం జరిగింది. ఈఈ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో కొన్ని ఆలయాలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తామన్నారు. ఆగయ్య మాట్లాడుతూ జిల్లాలో ఆలయాల అభివృద్ధికి టీటీడీ ముందుకు రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెలను బాగుచేసుకుందాం



బందనకల్ పటాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్(సిరిసిల్ల): స్వచ్ఛమైన పల్లెలను బాగుచేసుకునేలా అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. మండలంలోని బందనకల్ గ్రామాన్ని జిల్లా స్వచ్ఛభారత్ బృందంతోపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు శుక్రవారం సందర్శించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం నిర్వహణ, ప్లాస్టిక్ నియంత్రణ, హరిత హారం మొక్కల పెంపకం, ఆరుబయట మలవిసర్జన రహిత గ్రామంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఉపాధిహామీ, ఐకేపీ స్వశక్తి సంఘాల మహిళల సమస్యలను తెలుసుకున్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సర్పంచ్ వెంకటేశ్వరి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ కార్తీక్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, స్వచ్ఛ భారత్ మిషన్ అధికారి సురేశ్ పాల్గొన్నారు.